చేలల్లోనే తెల్లబంగారం



చేనులోనే ఏరకుండా ఉండిపోయిన పత్తి

వాంకిడి, డిసెంబర్ 26 : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో పత్తి పంట విరగ్గాసింది. కూలీల కొరతతో పంట చేలన్నీ తెల్లబంగారం ఎండబోసినట్లుగా కనిపిస్తున్నాయి. ఆసలే దిగుబడులు లేక అన్నదాతలు అవస్థలు పడుతుంటే, కిలోకి రూ.10 ఇస్తేనే వస్తామంటూ కూలీలు అంటున్నారు. మరి కొందరు మహారాష్ట్ర నుంచి కూలీలను తీసుకొచ్చి పత్తి ఏరిపిస్తున్నారు. కోమటిగూడ, ఖమాన, ఆర్లి, బంబార, సోనాపూర్, వాంకిడి కలాన్, వాంకిడి ఖుర్ధు, గోయేగాం, మచ్చిగూడ, పేవుట, నర్లపూర్, బెండార, తేజాపూర్, ఖిర్డీ తదితర గ్రామాల్లో రోడ్డు వెంట పత్తి చేలు తెల్లబోయి కనిపిస్తున్నాయి.

రైతు బంధు వెంటనే జమ చేయాలి

వాంకిడి, డిసెంబర్ 26 : మండల రైతులకు యాసంగి పంటకు సంబంధించిన రైతుబంధు డబ్బులను ప్రభుత్వం తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని వాంకిడి మండల రైతు బంధు సమితి కో-ఆర్డినేటర్(పీఏసీఎస్ చైర్మన్)జబోరే పెంటు డిమాండ్ చేశారు. పెట్టుబడి సాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారని, ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కాగజ్‌నగర్, డిసెంబర్ 26 : కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న తెలుగు సబ్జెక్టు అతిథి అధ్యాపక పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డీ లక్ష్మీనరసింహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం, మిగతావారు 55 శాతం మార్కులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ లోగా దరఖాస్తులను కళాశాలలో సమర్పించాలని సూచించారు. వివరాలకు 7013607011నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

వాంకిడి, డిసెంబర్ 26 : వాహనాలపై ఉన్న పెండింగ్ చలానాలు చెల్లించేందుకు ప్రభుత్వం అందించిన రాయితీ సౌకర్యాన్ని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని వాంకిడి ఎస్ఐ సాగర్ సూచించారు. మంగళవారం నుంచి రాయితీ అమలులోకి వచ్చిందని, రాయితీ పోను మిగతాది చెల్లించాలని తెలిపారు. ఈ మేరకు బైకులపై 80 శాతం, కార్లపై 60 శాతం, భారీ వాహనాలపై 50 శాతం, ఆర్టీసీ బస్సులపై 90 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొన్నారు.

గిరి గ్రామాల్లో వైద్య శిబిరం

ఉషేగాంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

జైనూర్, డిసెంబర్ 26 : మండలంలోని ఉషేగాం ప్రభుత్వ దవాఖాన పరిధిలోని గిరిజన గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి రక్త పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రతి ఒక్కరూ తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే వారికి తగు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో రమేశ్, గణేశ్, హెచ్ ఏ జమ్మూ, జంగులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డులో బస్సులు రాక ఇబ్బందులు

ఫ్లై ఓవర్ నుంచి వెళ్తున్న ఆర్టీసీ బస్సు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 26 : ఆర్టీసీ బస్సులు సర్వీస్ రోడ్డు నుంచి కాకుండా ఫ్లైఓవర్ నుంచి వెళ్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆసిఫాబాద్ మండలంలోని మోతుగూడ గ్రామం వద్ద నాలుగు వరుసల రోడ్డు విస్తరణలో భాగంగా ఫ్లైఓవర్ నిర్మించారు. ఆర్టీసీ బస్సులు ప్రయాణికుల సౌకర్యార్థం సర్వీసు రోడ్డు నుంచి వెళ్లాలి. అయినా అలా వెళ్లడంలేదు. దీంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. దీనిపై ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీధర్‌ను వివరణ కోరగా, సర్వీస్ రోడ్డుపై పెద్ద సంఖ్యలో లారీలు, ఇతర వాహనాలు నిలిపి ఉండడం, పిల్లలు ఆటలాడుతుండడంతో బస్సులు వెళ్లేందుకు స్థలం లేకుండా పోతున్నదని, ఆ వాహనాలను అక్కడి నుంచి తీసివేస్తే బస్సులు నడిపిస్తామని వివరణ ఇచ్చారు.

అయ్యప్ప మహా పడిపూజ

రెబ్బెన, డిసెంబర్ 26 : రెబ్బెన మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయంలో సోమవారం రాత్రి గురుస్వామి సూర్య భాస్కర శర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ కనుల పండువగా నిర్వహించారు. వేద మంత్రాల నడుమ అయ్యప్పకు అభిషేకం నిర్వహించారు. దీక్షా పరుల శరణు నామస్మరణ, భజనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప గురు స్వామి కిరణ్‌స్వామి, దీక్షారులు గోలెం తిరుపతి, రామడుగుల సంతోష్, కొలిపాక హనుమన్‌సాయి, హోటల్ శ్రీనివాస్, విక్రం, మొగిలి, రాజమొగిలి, నారాయణ, భక్తులు పాల్గొన్నారు.

మహా పడిపూజలో అయ్యప్ప దీక్షాపరులు, భక్తులు

అందమైన ప్రవాహం

అటవీ ప్రాంతం.., మారుమూల గ్రామం.., నీలంగా ఆకాశం.., అక్కడక్కడా దూదిపింజాల్లాంటి మబ్బులు.., అటు పక్క నుంచి ఇసుక తెన్నెలను తాకుతూ పోతున్న పెద్దవాగు ప్రవాహం.. ఇదంతా చూస్తుంటే ఆహా..! అనిపిస్తున్నది కదూ. మారుమూల గ్రామం కమ్మర్‌గాం సమీపంలో ప్రవహిస్తున్న పెద్దవాగు అందం.. ప్రకృతి గీసిన చిత్రంలా ఉన్నది. చూపరులను ఆకట్టుకుంటున్నది. ఇంతటి రమణీయ దృశ్యం.. అటవీ శాఖ అధికారుల కెమెరాకు చిక్కింది. - పెంచికల్ పేట్, డిసెంబర్ 26

కమ్మర్‌గాం సమీపంలో పెద్దవాగు ప్రవాహ అందాలు

ఎమ్మెల్యే కోవ లక్ష్మికి సన్మానం..

- మర్యాదపూర్వకంగా కలిసిన కెరమెరి మండల రైతులు, ఆసిఫాబాద్ మండల నాయకులు

కెరమెరి, డిసెంబర్ 26 : ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని కెరమెరి మండల రైతులు కేంద్రె బాలాజీ, పెందోర్ జల్పత్‌రావ్ సోమవారం మర్యాదపూర్వంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని ఆమె స్వగృహంలో రైతులు, సర్పంచులతో కలిసి శాలువతో సన్మానించి, ఆవుదూడ ప్రతిమను బహూకరించారు. పార్డి సర్పంచ్ భీంరావ్, రైతులు దందురావ్, జల్పత్‌రావ్, కేంద్రె నాగ్‌నాథ్, దస్తగిర్, కుర్సేంగా మారుతి, రాంచందర్, ఆత్రం గంగారాం తదితరులు పాల్గొన్నారు.

నాయకుల ఆధ్వర్యంలో..

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 26 : ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని తిర్యాణి మండల బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు హనుమండ్ల జగదీష్, మండల నాయకులు గాయంగి మల్లేశ్, శంకర్ గౌడ్, ఉప సర్పంచ్, తోట లచ్చన్న, సామనపల్లి బహ్మమ్ము సోనేరవు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి : ఎమ్మెల్యే కోవ లక్ష్మిని సన్మానించి, జ్ఞాపిక అందజేస్తున్న రైతులు బాలాజీ, జల్పత్‌రావ్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మండల నాయకులు

వైభవంగా దత్త జయంతి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్ : పల్లకీ సేవలో అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 26 : జిల్లా కేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో మంగళవారం దత్త జయంతి వేడుకలు వైభవంగా సాగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు మధూకర్ శర్మ, అర్చకుడు సాయి శర్మ ప్రత్యేక హోమాలు, అభిషేకం, పల్లకీసేవ, పూజలు నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ అచ్చేశ్వర్ రావు, పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు భజన కమిటీల ఆధ్వర్యంలో భజన, కీర్తనలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జైనూర్‌లో..

జైనూర్, డిసెంబర్ 26 : మండలంలోని జామ్ని గ్రామంలో దత్త జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ నారాయణ్ మహరాజ్ ప్రవచనాలు భజన కీర్తనలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సతీశ్ ముండే, మెస్రం రాహుల్ సర్పంచ్, సమాధాన్ ఉప సర్పంచ్ డోంగ్రె సుభాష్, నాగనాథ్ కేంద్రె పాల్గొన్నారు.

దహెగాం : బిబ్రా ఆలయంలో బాబా చిత్రపటాలతో భక్తులు

జైనూర్ : జామ్నిలో పాల్గొన్న భక్తులు

దహెగాంలో..

దహెగాం, డిసెంబర్ 26 : దహెగాం మండలం బిబ్రా గ్రామంలోని లక్ష్మీ వేంకటేశ్వర సద్గురు సాయినాథ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా మూల విరాట్‌కు అభిషేకం చేసి, కర్పూర హోమం చేశారు. భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో పూజారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్ర

దహెగాం, డిసెంబర్ 26 : అయోధ్య నుంచి వచ్చిన పూజిత అక్షంతలను దహెగాం మండల కేంద్రంలోని ఎల్లమ్మ గుడి నుంచి శివకేశ ఆలయం వరకు, అక్కడి నుంచి లగ్గామ ఉమా చంద్రశేఖర ఆలయం వరకు మంగళవారం భాజాభజంత్రీలతో శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ అర్చకులు పరమేశ్వర శర్మ, శ్రీకాంత్ చారితో కలిసి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు రాపర్తి ధనుంజయ్, ఎక్కరి బావాజీ, తోట చందు, సంజీవ్, సురేశ్, బజరంగ్ దళ్ సేవా సభ్యులు కార్తీక్, గిరి, నవీన్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌లో..

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 26 : ఆసిఫాబాద్ మండలానికి సంబంధించిన అయోధ్య రామ మందిర అక్షింతలు ఆసిఫాబాద్‌కు చేరుకున్నాయి. కాగజ్‌నగర్ నుంచి తీసుకువచ్చి జన్కాపూర్‌లోని రామాలయంలో భద్రపరిచారు. మహిళలు మంగళ హారతులు, భజనలతో స్వాగతం పలికారు. జనవరి 1 నుంచి 15వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాలకు ఇంటింటా అక్షింతలతో పాటు కరపత్రాలు, శ్రీ రామ మందిర చిత్రపటం పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని ప్రముఖులు, వ్యాపారులు పాల్గొన్నారు.

రెబ్బెన : దేవులగూడ గ్రామంలో అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్, డిసెంబర్ 26 : కాగజ్‌నగర్ పట్టణంలో భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శ్రీ రామ మందిరం, ఆహ్వాన పత్రం ఆవిష్కరించారు. జనవరి 15న ఇంటింటా అక్షింతలు, శ్రారామ మందిర చిత్రపటం అందిస్తామని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ విభాగ్ ప్రచారక్ భానుచందర్ తెలిపారు. జనవరి 22న అయోధ్యలో శ్రీ రాముడి విగ్రహ ప్రతిష్టాపన నేపథ్యంలో ప్రతి మందిరంలో భజన కార్యక్రమం నిర్వహించాలని, అదే రోజు సాయంత్రం ఇంటింటా ఐదు దీపాలు వెలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో భజరంగ్ దళ్ జిల్లా అధ్యక్షుడు శివగౌడ్, నాయకులు ఉన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన, డిసెంబర్ 26 : రెబ్బెన మండలంలో శోభాయాత్ర కనులపండువగా సాగింది. దేవులగూడ గ్రామం వద్ద భక్తులు ఆశీర్వచన అమృత అక్షింతలు ఎదుర్కొని ఊరేగింపు నిర్వహించారు. రెబ్బెన శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయానికి వచ్చి పూజలు చేశారు. అక్షింతలను భద్రపర్చారు. జనవరి 2న ఇంటింటికీ పంపిణీ చేస్తామని హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గోలెం తిరుపతి తెలిపారు.

దహెగాంలో ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ఆసిఫాబాద్‌లో..

కాగజ్‌నగర్ : చిత్రపటం, ఆహ్వాన పత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

కేసుల పరిష్కారమే లోక్ అదాలత్ లక్ష్యం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి ఎంవీ రమేశ్

మాట్లాడుతున్న జడ్జి ఎంవీ రమేశ్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 26 : జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో పెండింగ్ కేసులు లేకుండా చూడడమే లోక్ అదాలత్ లక్ష్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి ఎంవీ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టులో ఈ నెల 30న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కేసుల్లో ఇరువర్గాల రాజీమార్గంలో లోక్ అదాలత్ కేసుల పరిష్కారానికి వేదికగా నిలుస్తుందన్నారు. సివిల్, క్రిమినల్, కాంపౌండేబుల్, చెక్ బౌన్స్, పార్టిషన్, కుటుంబ సమస్యలు ఇతర అన్ని రకాల కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ నేపథ్యంలో కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృథా కాకుండా, ఆర్థిక నష్టం లేకుండా సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. ఆసిఫాబాద్ పరిధిలో ఉన్న వారు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ కార్యక్రమంలో సాధ్యమైనన్ని కేసులు పరిష్కరించే దిశగా న్యాయవాదులు, పోలీసు అధికారులు సమన్వయంతో ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ఇరువర్గాల పరస్పర అంగీకారంతో కేసులు పరిష్కరించేలా చూడాలన్నారు. కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

సిర్పూర్(టీ), డిసెంబర్ 26 : సిర్పూర్ (టీ) మండలం అచ్చల్లి గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి ఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో డ్రైవర్ చింతపురి సత్తయ్య (40) అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. అచ్చల్లి గ్రామానికి చెందిన సత్తయ్య ఆటో డ్రైవర్. చింతకుంట నుంచి అచ్చల్లికి ఆటోలో వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ మూల మలుపు వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. మృతదేహాన్ని సిర్పూర్(టీ) దవఖానకు తరలించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

బెల్లంపల్లి, డిసెంబర్ 26 : పట్టణంలోని ఏఎంసీ గ్రౌండ్‌లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న హరీశ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ముగిశాయి. మంగళవారం జరిగిన ఫైనల్ పోటీల్లో మందమర్రి విరాట్ జట్టు, బెల్లంపల్లి స్పార్కర్స్ జట్టుపై విజయం సాధించింది. ముగింపు కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతారి స్వామి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖలీల్ బాయి, కనుకుంట్ల రాజేశ్, బాలు యాదవ్, చిలుముల వెంకటస్వామి, జక్కుల శ్రీను, తోటపల్లి సమ్మిరెడ్డి, పిల్లి ఆనంద్, సదానందం, నల్లవెల్లి సుజాత, నరేష్, నిర్వాహకులు ఇమ్ము కుమార్, కిషన్, అనీఫ్, రోషన్, అభి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రోఫీతో విన్నర్ మందమర్రి విరాట్ జట్టు

శివాలయంలో ముగిసిన పూజలు

సదాశివపేట శివాలయంలో ఏర్పాటు చేసిన అగ్ని గుండం

కౌటాల, డిసెంబర్ 26 : కౌటాల మండల కేంద్రంలోని సదాశివపేట శివాలయం 50వ వార్షికోత్సవ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు అంబేద శంకరయ్య, అంబేద సంతోష్ ఆధ్వర్యంలో శివుని ఆరాధన, హారతి, వీరభద్ర పూజలు, అగ్ని గుండ ప్రవేశం, మహా గణపతి, రుద్రహోమం, పూర్ణాహుతి, ఆశీర్వచనం, హారతి, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. ముఖ్యంగా అగ్ని గుండాల ప్రవేశానికి కౌటాల మండలంతో పాటు సమీప మండలాలు, మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శ్రీ శైలం మల్లికార్జున స్వామి ఆలయం నుంచి వచ్చిన వేద పండితుల మంత్రోచ్చరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

28 నుంచి ప్రజాపాలన సదస్సులు

కెరమెరి, డిసెంబర్ 26 : కెరమెరి మండలంలో ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన సదస్సులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతీల వారీగా ఎంపీడీవో మహేందర్, డ్యిప్యూటీ తహసీల్దార్ రాజలింగు ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సు వివరాలు ఇలా ఉన్నాయి. 28న కెరమెరి, కొటారి, రింగన్‌ఘాట్, కెస్లాగూడ.., 29న గోయగాం, బోరిలాల్‌గూడ, అనార్‌పల్లి, ధనోర.., 30న మోడి, బాబేఝరి, జోడేఘాట్, ఝరి.., జనవరి 2న అగర్‌వాడ, బోలపటార్, అంతాపూర్, ఖైరి.., 3న సావర్‌ఖేడ, దేవాపూర్, కరంజివాడ, సుర్దాపూర్.., 4న మెట్టపిప్రీ, గోండ్‌గూడ, ఇందాపూర్, పార్డ.., 5న పరందోలి, కేలి(బీ), ముకదాంగూడ, నిషాని.., 6న తుమ్మగూడ, సాకడ, సాంగ్వీ గ్రామ పంచాయతీల్లో సదస్సులు ఉండనున్నాయి. జనాభా ఆధారంగా కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తామని ఎంపీడీవో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హామీలను నెరవేర్చాలి

మాట్లాడుతున్న దుర్గం దినకర్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 26 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన హామీలను నెరవేర్చాలనీ సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దుర్గం దినకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలపై సీపీఎం అనేక పోరాటాలు చేస్తున్నదని గుర్తుచేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ జిల్లాలో సాగు, తాగు నీటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అలాగే పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కార్తిక్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు

ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుకు పూల మొక్కను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్

కాగజ్‌నగర్, డిసెంబర్ 26 : సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబును మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఎండీ సద్దాం హుస్సేన్ మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో గల ఎమ్మెల్యే నివాసంలో తన సోదరుడు అజర్ హుస్సేన్‌తో కలిసి ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు ఉన్నారు.

ఫిబ్రవరి 24న ఓపెన్ డిగ్రీ పరీక్షలు

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, డిసెంబర్ 26 : అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ 3, 5వ సెమిస్టర్ పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 24 నుంచి నిర్వహించనున్నట్లు స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ దత్తాత్రేయ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు జనవరి 17వ తేదీలోగా పరీక్ష ఫీజులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని సూచించారు. వివరాలకు 98663 98678, 73829 29651 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.